# అమోఘ వచనం

ఒకనాటి సాయంకాలం బ్రహ్మకూ ఆయన భార్యామతల్లి అయిన సరస్వతికీ చిన్న వాగ్వాదం ప్రారంభమయింది.

"ఏమండి, సృష్టికర్త అనే ఖ్యాతి యావత్తూ మీకే వచ్చింది గాని నాకెందుకు రాలేదు" అన్నది సరస్వతి.

"సృష్టి చేసింది నేనేగా?" అన్నాడు బ్రహ్మ.

"నేను మాత్రం మీకు సహాయ పడలా?"

"సృష్టి చెయ్యటంలోనా? ఎట్లా?"

"మీరు సృష్టించిన మానవులకు వాక్కు ప్రసాదించింది నేను కాదూ?"

"అయితే మటుకు?"

"నా ప్రభావంచేత మానవుడు సృష్టిలో సర్వోత్కృష్టుడుగా పరిణమించలా? ఇతర సృష్టినంతా అరికట్టి, తనే ఒక బ్రహ్మయి తనకు తానే సృష్టి చెయ్యటం నేరవలా? ఆ ఖ్యాతి న్యాయంగా నాది కాదూ?"

పురాణ దంపతుల్లో అంతఃకలహాలు బొత్తిగా లేని సంసారం బ్రహ్మదేవుడిదే. అటువంటి అన్యోన్య దంపతులు ఈ స్వల్ప విషయంమీద కలహించుకోసాగారు. బ్రహ్మదేవుడు తన భార్య తనమీదికి పోటీవస్తున్నందుకు అసూయపడ్డాడు.

తన భర్త తనని అన్యాయం చేస్తున్నందుకు రోషం తెచ్చుకున్నది సరస్వతి. మాట మీద మాటపెరిగి సరస్వతీ—బ్రహ్మల కలహం మిన్నుముట్టింది.

ఈ సమయంలోనే దేవుడల్లే నారదుడు అక్కడికి వచ్చాడు.

ఇతిహాసం నారదుడికి రెండు విషయాల్లో అన్యాయం చేసింది. అతనికి 'లోకసంచారి' అనే పేరు అకారణంగా వచ్చింది. అతడు నిజంగా తిరుగుబోతు కాదు. మనరిపోర్టర్లకంటే, మన భీమా ఏజంట్లకంటే, తారలను బుక్ చెయ్యడానికీ, షేర్లు పోగుచేయటానికి మన ప్రొడ్యూసర్లకంటే, పైత్యపుదడ వచ్చినప్పుడు మన తలకాయలకంటే, చాలా డబ్బు ఒక్కసారిగా చూసినప్పుడు మన కళ్ళకంటే, పిక్చరు రిలీజునాడు మన డైరెక్టర్ల బుర్రల కంటే ఎక్కువ తిరిగేవాడు కాదు నారదుడు. కాని ఆయన ఎక్కడికి పోయినా పనిమీద పోక, ఊరికెనే వెళ్ళేవాడు గనుక అతనికి తిరుగుబోతనే బిరుదనామం వచ్చింది.

నారదుడు కలహప్రియుడు కూడా కాదు. ఆయన తనంతట తను ఏ పోట్లాటా ప్రారంభింపజేసి ఎరగడు. మీదు మిక్కిలి ఆయనకు పోట్లాటలు పొదముట్టించడం హాబీ. అయితే

ఏ జాడ్యమైనా కొంత ఉద్రేకించినమీదట గాని సమూలంగా చికిత్సకాదు గనుక, నారదుడు పోట్లాటలను పెంచి, పక్వానికి తెచ్చేవాడు. ఇతరులు పోట్లాటలను అణచి పెడతారు. అది ప్రమాదమని నారదు డెరుగును.

"నా మానస జననీజనకులేదో విలాసార్థం తర్కించుకుంటున్నట్టున్నారే!" అన్నాడు నారదుడు.

నారదుణ్ణి కూచోబెట్టి సరస్వతీ బ్రహ్మ తమ కలహకారణం చెప్పారు. అంతా విని నారదుడు తీర్పు చెప్పటానికి ఉపక్రమించాడు.

"తల్లిగారు సాయపడేవరకూ నాన్నగారు కలరా పురుగులూ, ప్లేగు క్రిములూ, మహమ్మారి క్రిములూ మొదలుకొని తేళ్ళూ, నల్లి, తాచులూ, కప్పలూ, కందిరీగలూ, కాకులూ, బొద్దింకలూ, గద్దలూ, కాళ్లజెర్రులూ, సింహాలూ, పులులూ, కుందేళ్లూ, మొసళ్లూ మొదలైన క్షుద్ర మృగాలను సృష్టించినమాట వాస్తవమే. ఆయనసృష్టిలో తోకలేని కోతికంటే ఉత్తమమైన జంతువు తయారుకాలేదు.

"తల్లిగారి ప్రభావంవల్ల మానవుడు వాక్కు పొందగలిగాడు. తక్షణమే వేదాలూ, ఉపనిషత్తులూ, పురాణేతి హాసాలూ, శాస్త్రాలూ, విజ్ఞానమూ, కళా, సంస్కారమూ, నాగరికతా భూమి మీదికి అవతరించినై. అనేక కోట్ల శతాబ్దాలుగా తండ్రిగారు ఒంటరిగా సాధించలేని పని తల్లిగారు బహు స్వల్పకాలంలో ఇట్టే సాధించగలిగింది" అన్నాడు నారదుడు.

బ్రహ్మ మొహం ముడుచుకున్నది. కాని సరస్వతి మెరిసే కళ్ళతో "నారదుడు యదార్థం కనిపెట్టాడు!" అన్నది.

"అయితే" అన్నాడు నారదుడు. సరస్వతి ప్రాణం చివుక్కుమనేటట్టు, "తండ్రిగారి సహాయం లేకపోయినట్టయితే మానవుడికి వాగ్దానం చెయ్యటం తల్లిగారికి సాధ్యమైవుండేది కాదు. మానవుడంటూ ఒకడు సృష్టి అయినాక ఆవిడ ఆ మానవుడికి వాక్కు ప్రసాదించగలిగింది గాని, తేళ్ళకూ, లేళ్ళకూ, కోళ్ళకూ ఆవిడ వాక్కు ఇవ్వగలిగిందా?"

"అదీగాకా" అన్నాడు నారదుడు, సరస్వతి అగ్నిపర్వతమలే అయిపోతూ ఉండటం గమనించకుండా. "మానవుడికి వాగ్దానం చెయ్యటంలో తల్లిగారు కొంత తొందరపడ్డదేమో ననుకోవడానికి అవకాశం కన్పిస్తున్నది. ఏమంటే, భూమిమీదికి సకల విద్యలూ, సకల శాస్త్రాలూ అవతరించినప్పటికీ అవి మానవుణ్ణి పాతిత్యం నుంచి రక్షించలేకుండా ఉన్నై. వాటి ఫలితాన్ని మానవుడు పొందలేకుండా ఉన్నాడు. క్రియకు మానవుడు తన వాక్కును అబద్ధాలాడటానికి, తిట్టటానికి, అవాచ్యాలూ, అశ్లీలాలూ ఉచ్చరించటానికి ప్రయోగిస్తున్నాడు. మందులమ్ముకోవటానికి, ఎలక్షను ఉపన్యాసాలు చెయ్యటానికి, విప్లవాలు ప్రచారం చెయ్యటానికి ఉపయోగపడుతున్నది మానవుడి వాక్కు. పైగా మానవుడు మాట్లాడటం నేర్చి కొంత నష్టపడ్డాడు కూడాను. జంతువులు మాటసహాయం అవసరం లేకుండానే ఒకదాన్ని ఒకటి అర్థం చేసుకుంటై. ఒకజాతి మృగాన్ని మరొకజాతి మృగం కూడా అర్థం చేసుకుం

టుంది. కాని మానవుడు మానవుణ్ణి వాక్కు ద్వారా బొత్తిగా అర్థం చేసుకోలేకుండానే ఉన్నాడు. మీకు చెబితే ఆశ్చర్యం కలగొచ్చుగాని ఒక యజమాని తన కుక్కను అర్థం చేసుకునే దానికన్న ఆ కుక్కే తన యజమానిని బాగా అర్థంచేసుకుంటుంది. ఆఖరుకు ఒకరి నొకరు అర్థం చేసుకోవటం మానవుల్లో ఘనత కూడా అయింది. కావలిస్తే మానవ కవిత్వం చూడండి !"

ముకుళించిన బ్రహ్మయొక్క ముఖం తిరిగి సంపూర్ణంగా వికసించింది.

"కానీ" అన్నాడు నారదుడు, మళ్ళీ ఒక కొత్తదారి తొక్కుతూ. "ఈ తప్పు తల్లి గారిదే ననటానికి వీల్లేదు. తండ్రి గారు ప్రాణికోటి యొక్క ఉపయోగార్థం ఇచ్చిన శక్తులు అమోఘంగా పనిచేస్తూఉన్నై. అవి భుజించి క్షున్నివారణ చేసుకుంటూన్నై. నీరుతాగి దాహ శమనం చేసుకుంటూన్నై. దాంపత్య జీవనం ద్వారా జాతిని విస్తరించుకొంటూన్నై. కాని మానవుడు మాట్లాడి ఏమీ చెయ్యలేకుండా ఉన్నాడు. మానవుడు బ్రహ్మ నిర్దేశానుసారం కర్మచేస్తే కర్మ ఫలితం వెంటనే కనిపిస్తున్నది. సారస్వతా నిర్దేశానుసారం మాట్లాడినప్పుడు ఏమీ జరగటం లేదు. తల్లిగారి వరం నిర్వీర్యమై పోయింది" అన్నాడు నారదుడు.

"ఈ తప్పు మీదే ! మీరే ఇంతపని చేశారు !" అన్నది సరస్వతి, బ్రహ్మమీదికి కొడెతాచల్లే లేస్తూ.

"మానవుడికే అమోఘ వచనం ఉంటే —" అని సన్నగా అందించాడు నారదుడు.

"ఉంటుంది ! ఉండి తీరుతుంది ! ఎందుకుండదో చూస్తాను ! మీరు తక్షణం మానవుడికి అమోఘ వచనం ఇస్తారా, ఇవ్వరా ? అన్నది సరస్వతి.

"ఇదంతా నీ దుష్బుద్ధేరా అబ్బాయి !" అన్నాడు బ్రహ్మ నారదుడు కేసి దీనంగా చూస్తూ.

"అతన్ని అంటారేమిటి ? అతను బుద్ధిమంతుడు. నిజం ఎంత చక్కగా బయట పెట్టాడు! నేను మిమ్మల్ని నమ్మి మోసపోయినాను ! "

"నన్ను మానవుడికి అమోఘవచనం ఎలా ఇమ్మంటావు ? కొంపపోతుంది! లోకాలు తల్లక్రిందులవుతై"

"ఆమాట నిజమా ?" అన్నది సరస్వతి నారదునితో.

నారదుడు ఆలోచన అభినయించి తన వీణ తాల్మాకు మందరం మీటుతూ, "ఏ శక్తినైనా జీవి దుర్వినియోగపరిచే అవకాశం ఉంది. అందుకని సృష్టిలో—"

"ఏ శక్తి లేకుండా చేస్తామా ?" అని పూర్తిచేసింది సరస్వతి.

బ్రహ్మ నాలుగు తలలతోనూ సమ్యగాలోచన చేశాడు.

"నీ సలహా ఏమిటో చెప్పరా నాయనా ! నువ్వేం చెయ్యమంటే అది చేస్తాను. నా మూలంగా ఎవరికి కష్టం కలిగినా నాకు బాధే! ఒకవేళ మీ తల్లి అన్న ప్రకారం చేసినా, తరవాత అందువల్ల చిక్కులొపరిస్తే ఆ తప్పు నా నెత్తిమీదే వేసి, ఇంకోవిధంగా చేస్తే చిక్కు

వచ్చేది కాదంటుంది ! మా ఇద్దరికి నచ్చే సలహా ఏమిటో నువ్వే చెప్పు !

నారదుడు మళ్ళీ ఆలోచించి, "ఒక్కసారిగా మానవులందరికి అమోఘ వచనం ఇవ్వటంకంటే, నా బుద్ధికి, ఏ ఒక్కడికో, తల్లిగారు ఎన్నుకునే వ్యక్తికి అమోఘవచన ప్రసాదం చేసిచూస్తే, అది ఎలా పరిణమిస్తుందో చూసి, అటు పిమ్మట అవసరమైతే ఇతర మానవకోటికి కూడా ఆ వరం అమలులో పెట్టటం బాగుటుందని ఉంది. ఇలా చెయ్యటం మీకు సమ్మతమేనా ?" అన్నాడు.

"ఓ !" అన్నది సరస్వతి.

"నాకు తప్పేదేముంది !" అన్నాడు బ్రహ్మ.

## 2

శివన్న శాస్త్రుల్లు చాలా సద్బ్రాహ్మడు. వేదాలూ, వేదాంతాలూ పఠ చదివినవాడు. లౌక్యం ఎరగక దారిద్రములో ఉన్నాడు. ఆయనా, ఆయన భార్యా, ఏడెనిమిదిమంది పిల్లలూ ఒక పల్లెటూళ్ళో ఊరిబయట ఒక చిన్న గుడిసెలో నివసిస్తూ ఉండేవారు. ఆయనకు విరోధులూ, విహితులూ లేరు. అమోమ వచనం ప్రసాదించడానికి ఆయనను ఎన్నుకొన్నది సరస్వతీదేవి.

శివన్న శాస్త్రుల్లు అలవాటుచొప్పున ఆనాడు అరుణోదయంవేళ లేచి నిత్యకృత్యాలు నెర వేర్చి, వీధి అరుగులో సంధ్యావందనం చేసుకోటానికి కూర్చున్నాడు. కాని ఆయన మనస్సు చేసే పనిలో లగ్నం కావటంలేదు. నిద్రలేచింది లగాయతూ తనలో ఏదో మార్పు కలిగి నట్టు అర్ధమవుతూ ఉండింది. పక్కమీద లేచి కూర్చుంటూనే, ఇల్లంతా కలయజూసి శాస్త్రుల్లు, "ఏమిటీ కొంప ? ఇంత చిన్న ఇంట్లో పదిమంది ఉండటమేమిటి ప్రపంచానికి వైశాల్యం లేనట్టు ! పెద్ద ఎకరం మేర ఇల్లు కట్టటం అసంభవమైనట్టు ! వాకిళ్ళలో నుంచి వంగిపోవటమేమిటి ? ఆరడుగుల వాకిళ్ళు శాస్త్రవిరుద్ధమైనట్టు ! ఈ ప్రపంచమంతా ఏమిటి ? వెధవ మనుషులు ! పురుగుల్లే ! బురదగుంటలో చాపల్లే ! ఇందులో కొందరు దరిద్రులూ, కొందరు సంపన్నులూనూ ! కొందరు తిండిలేక మాడేవాళ్ళూ ! పొలాలు పండనట్టు ! డబ్బు ఒకచేతికే అతుక్కుపోయి ఇంకో చేతికి పొమ్మంటే పోనట్టు ! . . . ఈ ధోరణిలో ఆయన ఆలోచనలు ఆయన ప్రయత్నం లేకుండానే పోసాగినై. తనపేరు శివన్నశాస్త్రుల్లేమిటి ? తనకు పేరెక్కడుంది ? ఏమిటీ నాటకమంతా ? తనని పిచ్చివాణ్ణిచేసి సాటి మానవులంతా ఆడిస్తున్నట్టు ఆయనకు అనుమానం కలిగింది. తనపేరు శివన్నశాస్త్రుల్లని నమ్మించారు ! తనంత వేదాధ్యాయపరుడు లేడని నమ్మించారు ! చదివితే వాళ్ళకు వేదాలు రానట్టు ! అన్నీ వట్టివే ! వాళ్ళకు వేదాలక్కర్లేదు. పిచ్చిముండాకొడుకై తను చదివినందుకు తన్నీ విధంగా ఆడిస్తున్నారు. ప్రపంచం నిండా ఉద్యోగస్తులున్నారు, అధికార్లున్నారు, రాజులున్నారు. ఎక్కడో దేవతలున్నారు. ప్రతి వెధవా కడమ వెధవల్ని మోసం చేస్తున్నవాడే ! ఎందుకూ?

ఎందుకీ మోసం? తను ఏ రాజుకంటె తక్కువా? ఎందుకు తక్కువా? ఏ దేవత కంటె ఎందుకు తక్కువా? జీవితమంతా ఒక్కసారి ఋజువు కావలసిన అవసరంలేదూ? సృష్టి యావత్తూ ఋజువు కావాలి! ఎవడు చూశాడు, ఎంతమోసం జరుగుతున్నదో? తనకు వేరే పని ఏముంది కనకా! సృష్టిని ఋజువు చెయ్యటం తన పనిగా ఎందుకు పెట్టుకోకూడదూ?

సూర్యోదయ మయింది గాని తాను ఇంకా తర్పణాలు విడవలేదు. అయినా ఫరవాలేదు సూర్యుణ్ణి ముందు ఋజువుచెయ్యాలి. తర్పణాలు విడవని కారణంచేత సూర్యుడు ఉదయించ లేకపోతే అందరూ సంధ్యావందనం మానేసి సూర్యుడి అంతు కనుక్కోవచ్చునే! ఇంత కాలమూ తను ఎంత మౌఢ్యంలో ఉండిపోయినాడూ!

అతిసౌమ్యుడైన శివన్నశాస్త్రుల్లు ఇట్లా మారిపోవటం వింతలేదు. అతి బలహీనమైన గోడలుగల ఇంట్లో కొత్తగా ఒక స్టీముయంత్రం నడపసాగితే ఇల్లు తనని తాను అపాయ కరంగా ఆత్మపరీక్ష చేసుకోసాగుతుంది. అతి బలహీనుడైనవాడు, అరగ్లాసు సారాయితాగినా ఆపనే జరుగుతుంది. ఎన్నడూ ఏశక్తీ ఎరగని శివన్న శాస్త్రుల్లుకు సరస్వతీ కృపవల్ల ఏ మానవుడూ ఎన్నడూ—ఏ యుగంలోకూడా— పొందలేకపోయిన వరం లభించింది. ఆ తాకిడికి అతని మనోబుద్ధి చిత్తాహంకారాలన్నీ ఉద్రూత లూగసాగినవంటే ఆశ్చర్యం ఏమిటె?

ఆకాశాన్ని దూసుకుని బ్రహ్మాండపు చివరలకు ఎగబ్రాకుతున్న శివన్న శాస్త్రుల్లు ఆలోచనలకు భంగం కలిగింది. వెదురుబద్దల వాకిలి కిర్రుమన్నది. వీధి చివర వుండే సుబ్బన్నశాస్త్రుల్లు వీభూది రేఖలు తీర్చివచ్చి "శ్రీకృష్ణ పరబ్రహ్మణేనమః" అన్నాడు. శివన్న శాస్త్రుల్లుకు తారామండలంగా మండింది. తనకంటె కూడా బీదవాడల్లే నటిస్తాడెందుకు ఈ సుబ్బన్న శాస్త్రుల్లు? ఎంత బీదవాడైతే అంత భాగ్యవంతుడి దగ్గరికి పోవాలి. న్యాయంగా—వాడి దారిద్ర్యం అంత అధికమైనది గనక దాన్ని తీర్చటానికి అంత ధనికుడే కావాలి. ఈ సుబ్బన్న శాస్త్రుల్లు తన ఇంటి కొస్తాడెందుకూ? కరణంగారింటికి పోయి ఒక బస్తా వడ్లు తెచ్చుకోరాదూ?

"ఇంట్లో బియ్యం నిండుకున్నయోయ్ సుబ్బన్న శాస్త్రుల్లూ!" అన్నాడు శివన్న శాస్త్రుల్లు. ఆమాట ఆయన నోటివెంట అదివరకెన్నడూ రాలేదు. ఐనా ఇప్పుడది ఆయన నోటివెంట అలవాటున్నట్టే, బాగా ధాటీగానే వచ్చింది. సుబ్బన్న శాస్త్రుల్లు కాస్సేపు నివ్వెర పడి చూసి, శివన్నకేసి చాలాసేపు చూడలేక వెళ్ళిపోయినాడు.

మరో క్షణంలో శివన్న శాస్త్రుల్లు భార్య అదరా బాదరా బయటికి పరుగెత్తుకొచ్చి, సమాధిలో కూర్చున్నట్టు అరుగుమీద కూర్చొని ఆకాశంలోకి చూస్తున్న భర్తతో, "ఇదేం విడ్డూరమండీ, ఇళ్ళంతా బియ్యమే! ఎక్కడ చూసినా మడమలోతు బియ్యం! బోలెడంత పాచిపని చేసుకోవాలిసుంది. ఎలా చచ్చేది? ఇది ఎవరు చేసిన పనంటా!" అని చేతులు తిప్పసాగింది.

తన ఆలోచన సాగకుండా తన భార్యగా వ్యవహరిస్తున్న ఈ క్రిమి లబలబలాడటం

శివన్న శాస్త్రుల్లుకు చిరాకు కలిగించి, "నీ ఏడుపేమిటే, పిచ్చిముండా?" అని కేక వేశాడు.

మరుక్షణం సోమిదేవమ్మగారు బావురుమని పెద్దపెట్టున ఏడుస్తూ, జుట్టుపీక్కుంటూ, మొహమంతా రక్కుకుంటూ, పళ్ళు కొరుక్కుంటూ, ఇంటి ఆవరణ యావత్తూ దిండుబు తొక్కనారంభించింది.

ఈ ఉపద్రవంతో శివన్న శాస్త్రుల్లు మైకం తాస్త వొదిలి నట్టయింది. ఆయనకు భార్య వాలకం చూస్తే భయం వేసింది. నటిస్తున్నదా అనుకున్నాడు. కాని ఆవిడ అమాయకురాలు, మహాసాధ్వి, అల్లరిమనిషి ఎంతమాత్రమూ కాదు. తల్లి స్థితి చూసి పిల్లలంతా పెద్దపెట్టున ఏడవసాగారు. ఒకమూల నుంచి ఊళ్ళోవున్న జనమంతా వింత చూడటానికి పోగవుతున్నారు. అందరూ తలో ప్రశ్నా వేస్తున్నారు. కొద్దిసేపట్లో శివన్నశాస్త్రుల్లు భార్యకు ఎవరో చేతబడి చేశారనీ, దయ్యం పట్టిందనీ, పిచ్చెత్తిందనీ, శివన్నశాస్త్రుల్లు ప్రొద్దున్నే లేచి పెళ్ళాన్ని కొడితే ఆవిడ నురుగులు కక్కుకుంటూ పడిపోయిందనీ, ఆవిణ్ణి కింద పెట్టారనీ రకరకాల వార్తలు గ్రామమంతటా వ్యాపించినై. మంచాల్లోపడి తీసుకుంటున్న వారు సయితం కాళ్ళీడ్చుకుంటూ, కర్రల సహాయంతోనూ, మరొకరిని ఆధారం చేసుకుని ఈ వింత చూడవచ్చారు.

భూతవైద్య డొకాయన ఒకమూల ముగ్గు వేస్తున్నాడు. వైద్యుడు రోగినాడి పరీక్షించి ఏమీ లేనందుకు ఆశ్చర్యపడుతున్నాడు. షుమారు రెండువందల యాభైమంది శివన్న శాస్త్రుల్లును ఒక్కసారిగా రెండువేల అయిదువందల ప్రశ్నలు వేస్తున్నారు. ఆయన ఎవరికని సమాధానం చెబుతాడు? ఎవరికి చెప్పటానికైనా జరిగినదేమిటో తనకైనా అర్థమయితే కద? ఈ అల్లరిలో "అమ్మోయ్! అమ్మా?" అని పిల్లల ఏడుపూ!

"ఊరుకోండ్రా! మీ నోళ్ళు పడా!" అని శివన్న శాస్త్రుల్లు పిల్లల్ని కోప్పడ్డాడు. అంతటితో వాళ్ళ గోల అణిగింది.

కాని మిగిలిన వాళ్ళింకా రణగొణధ్వని చేస్తూనే ఉన్నారు. అకస్మాత్తుగా శివన్న శాస్త్రుల్లుకు ఆ జనం మీద చెప్పరాని రోతపుట్టింది. దోమలు, కొంకిపురుగులు!

"ఎందుకు మీరంతా ఇక్కడా?" అని అరిచాడు శివన్న.

"అయ్యో పాపం, నీ భార్య అంత ఇక్కట్టులో ఉంటే—"

"నా భార్యకేం రోగం లేదు, మీకు ఏం రోగంలేదు, ఎట్లా వచ్చినవారట్లా పొండి!" అని శివన్న గద్దించాడు.

వెంటనే సినిమాలో రివర్సు షాటులోలాగా వచ్చిన జనమంతా వెనక్కు నడుచుకుంటూ ఎవరిళ్ళకు వారు వెళ్ళిపోయినారు. రకరకాల జబ్బులతో తీసుకుంటూ వచ్చిన వారికి, ఇంటికి పొయ్యేటప్పటికి రోగాలు నయమై ఉన్నై.

శివన్నశాస్త్రి భార్యకూడా గారడీ చేసినట్టు మామూలు మనిషి ఐంది. ఆవిడ తడికళ్ళు ఆర్చుతూ, "ఏమిటండీ. ఏం జరిగిందీ? నా మనస్సంతా గందరగోళముగా ఉందే! ఏదం దర్రా, పిల్లలూ! చద్దన్నాలు పెట్టుకు తినండి. నే నిల్లంతా బాగుచేసుకోవాలి... అయ్యో,

అదేమిట్రా ? అలా గుడ్లుపెట్టుకు చూస్తారేం ? కాస్త ఈ పిల్లల సంగతేమిటో చూడండీ ! నాకు భయం వేస్తున్నదీ, పలక రేమ్రా ?" అని వాపోవసాగింది.

అసలే చికాకుగా వున్న శివన్న, "ఊరుకోవే ! మీ అమ్మకు సమాధానం చెప్పరేంరా? చెప్పండి !" అన్నాడు.

"పెట్టుకు తింటామమ్మా ?" అన్నారు పిల్లలు.

శివన్నశాస్తుల్లుకు నీరసం వచ్చేసింది. ఆయన కిప్పుడు ఏమీ ఆలోచించాలనిలేదు. ఏమీ చెయ్యాలనిలేదు. ఇదేదో తనకు దుర్దినం లాగుంది. నిద్ర లేచింది తను విన్న మాటకు గానీ చూసిన విషయాలకుగాని అర్థంలేదు. అందుకాశ్చర్యపడే ఓపిక కూడా లేదిప్పుడు. చాలా కాలం క్రితం తన తండ్రి పోయినప్పుడు తన మనస్థితి ఇలాగే ఉండింది. తనకుకూడా చచ్చి పోవాలనిపిస్తుంది. ఈ క్షణాన మైకం కమ్మి ఆ మైకం ఎప్పటికీ వదలకుండా ఉంటే బాగుం డును. అప్పుడే మైకం వస్తున్నట్టే ఉంది—ఇవాళ లేచి తను విన్నఅర్థంలేని మాటలు, చూచిన అర్థంలేని విషయాలు, విన్న మాటలు, చూసిన విషయాలు, తన్ను విన్న మాటలు, తను అన్న మాటలు—

కమ్ముకొస్తున్న మైకం అకస్మాత్తుగా వదిలింది. ఉదయం లేచింది లగాయతు తను అన్న మాటలన్నీ జ్ఞాపకం చేసుకోవడానికి ప్రయత్నించి విఫలుడైనాడు శివన్న శాస్తుల్లు. ఆ మాటలకూ తను విని చూసినవాటికీ ఏదో సంబంధం ఉన్నట్టు ఆయనకు అనుమానం తట్టసాగింది.

"ఏమండీ శివన్నశాస్తుల్లుగారూ, మీ ఇంట్లోవాళ్ళకేమో గాలిసోకిందీ చేసిందీ అని ఎవరో అన్నారు కాస్తనింపాదిగా ఉందా?" అని వీధినుంచి కేక వినిపించింది. శివన్న తల ఎత్తిచూస్తే కరణం. పొలానికి కామాలు పోతున్నాడు.

"నీకేమైనా గాలి తగిలిందేమో, మావాళ్ళకేమీ లేదు !" అన్నాడు శివన్న.

మరుక్షణం కరణం గభీలున ఆ మట్టిరోడ్డుమీద చతికిలబడ్డాడు. ఆయనకు పట్టరానంత పరాభవం అయింది. శివన్న తనను తృణీకరించి మాటాడటానికి తను ఎవరో తోసినట్టు పడ టానికి ఏదో సంబంధం ఉందనుకున్నాడు కరణంగారు. కాని అది రుజువు చెయ్యటం ఎలా ? గుడ్డలు దులుపుకుని ఆయన దారిన ఆయన వెళ్ళాడు కరణంగారు.

కాని ఇది చూసిన తరువాత శివన్నకు సందేహం ఒకటి మనస్సులో రూపం దాల్చ సాగింది. ఆయన ఎదురుగా వున్న అవిశిచెట్టుకేసి చూసి తన మనస్సులో, "ఈ చెట్టు విరిగి పడుగాక !" అనుకున్నాడు. నిజంగా పడుతుందేమోనని గుండె దడదడ లాడుతున్నది. కాని చెట్టు చెక్కుచెదరక పోవటంచూసి మళ్ళీ ధైర్యం తెచ్చుకున్నాడాయన. కాని ఆ ధైర్యం వెంటే మరో సందేహంకూడా కలిగింది. దాన్ని రహితం చేసుకొనటానికి గాను బిగ్గరగా, "విరిగి పడవే అవిశిమొక్కా !" అన్నాడు. మరుక్షణం పది అడుగుల ఎత్తు పెరిగిన ఆ అవిశిచెట్టు పెళ్ళున విరిగి పడింది.

శివన్నకు ముచ్చెమటలు పోసినై. తనకెవరో శాపం పెట్టారు. తన నోటివెంట వచ్చిందల్లా నిజమవుతున్నది. తను ఇక నోరు కట్టేసుకోవాలి. ఆయన గబగబా లోపలికి పోయి భార్యను సమీపించి, "ఒసే నేనొక నెలదాకా మౌనవ్రతం పట్టబోతున్నాను. నాతో ఎవరూ మాట్లాడవద్దు. నన్ను పలకరించటానికి ఎటువంటి ప్రయత్నమూ చెయ్యవద్దు. మనింటికి వచ్చినవారికూడా గట్టిగా చెప్పు!" అన్నాడు. అటువంటిదేదో చేస్తేతప్ప తన జీవితం దుఃఖభాజనమైపోతుంది. ఒక్క జామసేపట్లోనే ఇంత అల్లరి అయితే జీవితమంతా ఎలా గడపటం?

"మౌనవ్రత మేమిటండీ, ఎక్కడోనూ? ఎప్పట్నించి పడతారూ?" అన్నది భార్య

"ఇప్పటినుంచే!"

అంతే, మరి శివన్న నోరు తెరవలేదు.

## 3

"చమత్కారం చిత్తగించారా? అన్నాడు నారదుడు బ్రహ్మతో. శివన్నశాస్తుల్లు, సరస్వతీ వరప్రసాదం జాస్తి అయి మౌనవ్రతం పట్టాడు. అయ్యవారిని చెయ్యబోతే కోతి అయిందన్నట్టు, మనిషిని దేవత చెయ్యబోతే పశువై ఊరుకున్నాడు!"

"ఈ అపహాస్యం నాకు నచ్చటంలేదు. దీన్ని వెంటనే ఉపసంహరించే సదుపాయం చేద్దూ!" అన్నాడు బ్రహ్మ.

"మీరలా తొందరపడకండి. ఇది అపహాస్యమని మనం అనుకుంటే కాదు, తల్లిగారికి తెలిసిరావాలి...!"

నారదుడు సరస్వతీదేవి దగ్గిరికిపోయి, "అమ్మా, వ్యవహారం వికటించింది. ఆ బ్రాహ్మడుకాస్తా మౌనవ్రతం పట్టాడు. దేవతను చెయ్యబోతే పశువైనాడని తండ్రిగారు నవ్వుతున్నారు!" అన్నాడు.

"ఆ బ్రాహ్మణ్ణి మౌనవ్రతం వెంటనే మానెయ్యమను. ఎక్కడో వాజమ్మలాగున్నాడు!" అన్నది సరస్వతి.

"అసంభవం. ఈ నెలరోజులూ చెల్లేలోపల అతను కావాలన్నా మాట్లాడలేడు. అతని నోటివెంట వచ్చిన మాట—"

"నాకు తెలుసు, నాకు తెలుసు!" అన్నది సరస్వతి ఆదుర్దాగా, అటూ ఇటూ పచారు చేస్తూ. "ఈ నెలా ఆయిన తరువాత అతని మనస్తత్వం మారితీరాలి. మనం ఇచ్చిన వరాన్ని అతను వుపయోగించాలి."

"దుర్వినియోగపరిస్తే?"

"పరచనీ! ముందు దుర్వినియోగ పరిచిగాని సద్వినియోగం జాడ తెలుసుకోలేడు ఎలాగూ."

"మీ చిత్తం!" అన్నాడు నారదుడు.

"విషయం ఇంతదూరం వచ్చిన తరువాత నీళ్ళు నమలకు!" అన్నది సరస్వతి నిష్కర్షగా.

## 4

మౌనవ్రతంతో మొహం మొత్తిపోయింది శివన్నకు. ఈ నెలలోపల అతనికి అనేక పర్యాయాలు తన వాక్కుతో అవసరం కలిగింది—వాక్ప్రభావంతో కూడా అవసరం గలిగింది. కాని అది తన అందుబాటులో లేకుండా తానే చేసుకున్నాడు. పెట్టెలో బోలెడంత ధనం పెట్టుకుని తాళంచెవి, పారేసుకుని దారిద్ర్యం అనుభవించేవాడి సామెత అయింది శివన్నకు. పైగా మౌనంగా వుండవలసిరావటం అతని బుద్ధికి ఎన్ని లక్షల ఆలోచనలో తెచ్చి పెట్టింది. తన భావి కర్తవ్యమంతా నిర్ధారణ చేసుకున్నాడు శివన్న. తన కొత్త శక్తిని సమగ్రంగా ఉపయోగించుకునే మనోబలం, మౌనకాలంలో సాధించాడు.

వాక్కు లభ్యమైన మరుక్షణం శివన్న అదృశ్యమై పోయినాడు. అతను తనకు చిరునామా లేకుండా చేసుకున్నాడు. తానే భగవంతుడు. తన ఉనికి ప్రపంచం. తనే శక్తిస్వరూపుడు. బ్రహ్మసృష్టి యావత్తూ తన వాక్కుకు బానిస. మామూలు సంపర్కాలు—తన ఇల్లూ—వాకిలీ భార్యాబిడ్డలూ, కులమూ—గోత్రమూ విసర్జించేశాడు. శివన్న తన ఆకారం మార్చుకున్నాడు. అత్యున్నతమైన తన ఆకారం ధరించాడు. తనకోసం రకరకాల గృహాలు, విహారస్థలాలు నిర్మించాడు. తనకు పరివారంగాని, నౌకర్లుగాని, భృత్యులుగాని, స్నేహితులుగాని, చుట్టాలుగాని, విరోధులుగాని—ఎవ్వరూ అవసరంలేదు. తనకు సక్రమమైన కోరికలు ఆహార నిద్రాదులు అవసరం లేకుండా చేసుకున్నాడు.

ఆ స్థితి వచ్చిన తరువాత తనకు శరీరంతోనూ, కాలంతోనూ, స్థలంతోనూ అవసరం లేకుండా పోయింది. అతని బుద్ధి లీలల మీదుగా పోసాగింది. కొండలు చదును చెయ్యాలనిపించింది, నదుల్ని ఎండబెట్టా లనిపించింది. మేఘాలను భూమిమీద పాకించా లనిపించింది. ఎందుకంటే ఏమీలేదు—లీల. "నేనూ లీలామానుష విగ్రహుణ్ణి, పరమాత్మను!" అనుకున్నాడు శివన్న.

ఇదివరకల్లా తను వేటికి వెరిచాడో—భయమూ, అవమానమూ, చావు, బీభత్సమూ—వాటన్నిటినీ ఇతరుల మీద ప్రయోగించాలని శివన్నకు పుట్టింది. ఒక్కొక్క దేశం అకస్మాత్తుగా మహార్ణవమైపోతుంటే అందులో వున్న జనం బీభత్సంగా కేకలువేసి నీటిలోపడి చచ్చిపోతుంటే శివన్నకు చూడబుద్ధి అయింది. అది ఆనందంకూడా కాదు, పగ అసలే కాదు, అదొక అనుభవం. అతని మనస్సు అప్యాయంగా స్వీకరించే అనుభవం.

సూర్య చంద్రాదులు గతులు తప్పి అర్థంలేని నడక నడుస్తున్నారు. అసలు ప్రకృతే క్రమం తప్పింది. ఏ ప్రకృతి క్రమాన్ని తెలుసుకోవటానికి శాస్త్రజ్ఞులు జీవితాలకు జీవితాలు

ధారవోశారో, ఏ ప్రకృతి విన్యాసాలతో సౌందర్యపిపాసులు రససిద్ధి పొందారో, ఆ ప్రకృతి క్రమవిన్యాసాలు, శివన్నకు మొదట ఆహుతి అయినై. వాటి మీద మానవుడికి ఏ మూలనైనా పగ వున్నదేమో! శివన్నలో అణిగివున్న ఆ పగే ఇప్పుడవకాశం దొరికి పైకి వచ్చిందేమో! మానవ జాతిని సక్రమ పరిణామానికి దూరం చేస్తున్నది ఇటువంటి ఇంపల్సేనేమో. ఎక్కాల పుస్తకం అబద్ధం చెయ్యటంలో శివన్నకు పరితుష్టి లభించిందంటే దాన్నిబట్టి మనం అంతకంటె ఏం గ్రహించగలం?

మన మామూలు అభిప్రాయాల ప్రకారం శివన్న ఉన్మత్తుడు: అతని దెబ్బ చూసిన వారంతా ఉన్మత్తులైనారు. అతన్ని ఒక కొత్త శక్తిగా గుర్తించినవారు కూడా ఆ శక్తిని భగవంతుడుగా భావించి ఆరాధించారు. అతన్ని చూసినవారు లేరు. చూశామన్న వారిలోకూడా ఒకరితో ఒకరు ఏకీభవించలేదు; పైపెచ్చు పరస్పరం కలహించుకోసాగారు.

అనేకమంది అనేక రకాల అతని స్వరూపాన్ని చిత్రించారు. అందులో రెండు మూడు రకాల చిత్రాలకు ప్రచారం కూడా జాస్తిగా వచ్చింది. ఈ కొత్త భగవంతుడి స్వరూపం గురించి పోట్లాడుకునేవాళ్ళు పోట్లాడుకుంటూ ఉంటే, మరి కొందరు ఆ వివిధ స్వరూపాలన్నీ యదార్థమైనవే, ఆదిశక్తికి ఒక నియామక స్వరూపమేమిటని కొందరు వేదాంతులు సర్దారు. తనని గురించి ప్రజాభిప్రాయం ఏమిటో ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్న శివన్న తన ఏయే స్వరూపాలు బహుజనాదరణ పొందినవో వాటిని ధరించి అక్కడక్కడా సాక్షాత్కారం ఇవ్వ సాగాడు ప్రజలకు.

ఈ భీభత్సయుగంలో యుగ ధర్మాన్ని అనుసరించి ఒక కొత్త మనస్తత్వం ఏర్పడ్డది ప్రజలకి. ఆ మనస్తత్వం ప్రకారం తమ భగవంతుడిలో ఒక క్రమం వుందని తెలుసుకున్నారు. ఆ క్రమాన్ని తన భక్తుల ద్వారా శివన్నకూడా తెలుసుకున్నాడు. అప్రయత్నంగా శివన్న ఆ క్రమాన్ని అనుసరించి ప్రవర్తించసాగాడు. తన ఉత్కృష్టతను తృణీకరించినవాడు మరుక్షణం భయంకరమైన చావుచచ్చి, భస్మీపటలం అయిపోవలసిందే. తనను నమ్మినవాడు బాగుపడవలసిందే.

పాతక్రమం పోయిందేగాని కొత్తక్రమం వచ్చిందని శివన్న తెలుసుకోలేదు. ఈ కొత్త క్రమాన్ని తనకు క్రమంగా అలవాటు చేసింది భక్తులే. తన ప్రబల విరోధులంతా చచ్చి పోయినారు. ఇక ప్రపంచంలో తనని ఏదో విధంగా ఆరాధించనివాడు లేడు. రూప భేదాలతో, నామభేదాలతో అందరూ తననే ఆరాధిస్తున్నారు. తనేగా సర్వశక్తి. వాళ్ళు దేన్ని ఆరాధించినా అవి తనే అవుతున్నాడు. తను క్రమం తప్పి ప్రవర్తించినప్పుడు తన భక్తులు కొందరు ఏడుస్తున్నారు; మరి కొందరు తనని నిందించి లేడంటున్నారు. రెండూ తనకు కష్టంగానే ఉన్నై.

మానవులందరూ చిన్నచిన్న కష్టాలకూ సుఖాలకూ లోనుగావటం పైనుంచి చూడటం శివన్న కింపుగా వుంది. కాని వారి కష్టసుఖాలు తన కంటకపోవటం---తన ఏకాకిత్వం—

మాత్రం అతనికి రుచించలేదు. అప్పుడప్పుడు తాను కూడా తిరగాలనిపించేది, తిరిగేవాడు. ఎవరికో ఒకరికి కనిపించి "నేను భగవంతుణ్ణి!" అనేవాడు. తన దర్శనం దొరికినవాడు పొందే పారవశ్యం చూస్తే తనకు కళ్ళనీళ్ళ పర్యంతమయ్యేది. తనకంటే తన భక్తుడెంత ధన్యజీవి అనిపించేది.

మరికొంతకాలానికి శివన్నకు తన దేవత్వంతో ముఖ మొత్తింది. అతను తన వాక్శక్తిని ఉపయోగించి చాలా కాలమయింది. తన భక్తుల మీద ప్రత్యేక దృష్టి వుంచి వారిని ఒక కంట కనిపెట్టి ఉండటం కూడా అతనికి విసుగెత్తింది. అందులో చాలామంది తనను స్మరించుతూ కూడా పూర్తిగా మరిచారు. వారికి కావలసింది వారి దైనిక అనుభవం— తన సాన్నిధ్యం కాదు. అలవాటు చొప్పున వారు నిర్లిప్తులై నిత్యా తన నామం — వారు పెట్టిన నామం—స్మరిస్తారు. కాని వారి హృదయాలూ, మనస్సులూ తమ తీరు చిన్న చిన్న కష్టాల మీదా బుల్లి బుల్లి సుఖాల మీదా లగ్నమై ఉన్నై.

తనతో వారికి పని అయిపోయింది! తనతో తనకే పని అయిపోయింది!

## 5

"వాళ్ళ పడవ ఇంకోదరి పట్టింది. మనం మళ్ళీ ఓడిపోయినాం!" అన్నాడు నారదుడు సరస్వతితో.

"అతన్ని మళ్ళీ రెచ్చగొట్టి చూడు!" అన్నది సరస్వతి.

## 6

"ఏం దేవరా, తమ దేవత్వం ఎట్లా సాగుతున్నది?" అన్నాడు నారదుడు, శివన్నను సమీపించి.

"దేవుడు చేసేదేమీ లేదు. దేవుడైనవాడు ఏమీ చెయ్యకుండా ఉండటంకంటె చెయ్య దగిందిలేదు!" అన్నాడు శివన్న.

"నీకు పోటీ తగలబోతున్నది. ఇవాళో రేపో, నీకు సంప్రాప్తమైన వాక్శక్తే నీ భార్యకుకూడా కలగబోతున్నది" అన్నాడు నారదుడు.

"నా భార్యా? ఏం చేస్తుంది వాక్శక్తితో?"

"నువ్వు చేసిన పనే!"

"వద్దు! వద్దు! అమాయకుల జీవితాలను నా భార్య అకారణంగా ధ్వంసం చేస్తుంది. వాళ్ళ కష్టాలూ సుఖాలూ వాళ్ళకెంత ఇష్టమో దానికి తెలీదు" అని శివన్న వాపోయాడు.

"మీరిద్దరూ మీ శక్తి సామర్థ్యాలు ఒకరి మీద ఒకరు చూపరాదూ?"

శివన్న తల అడ్డంగా ఊపాడు.

"శక్తిసామర్థ్యాలు తెలిసిపోయిన తరువాత వాటిల్లో ఆనందమేమున్నది?"

*　　　　*　　　　*

"ఏంనారదా? మానవకోటి కంతకూ అమోఘవచనం ఇవ్వటం విషయం ఏం నిర్ణయించారు?" అన్నాడు బ్రహ్మ.

"మొదటి గృహీతకు మొహం మొత్తింది" అన్నాడు నారదుడు.

"మీ తల్లిగారికో?" అన్నాడు బ్రహ్మ, సరస్వతికేసి పక్కవాటుగా చూస్తూ.

సరస్వతి తల విసిరి చరచరా వెళ్ళిపోయింది.

బ్రహ్మ బిగ్గరగా నవ్వసాగాడు.

ముద్రణ : జూన్ 1942, తెలుగుతల్లి.